క్లుప్తంగా

మేమున్నామని..



చంద్రశేఖర్‌కు ధైర్యం చెబుతున్న స్నేహితులు

నరసన్నపేట: తమతో కలిసి చదువుకొని ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి మేమున్నామని ధైర్యం చెప్పారు. జలుమూరు మండలంలోని బసివాడకు చెందిన పాట్నూరు చంద్రశేఖర్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న నరసన్నపేట మండలంలోని కంబకాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002 బ్యాచ్‌కు చెందిన టెన్త్ విద్యార్థులు మంగళవారం రూ.50 వేలు ఆర్థిక సహాయం చేశారు. మున్ముందు కూడా ఆస్పత్రి ఖర్చులకు సహాయం చేస్తామని స్వామిబాబు, వెంకట్, తదితరులు ధైర్యం చెప్పారు.

ఆక్రమణదారులకు నోటీసులు జారీ



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు, సిబ్బంది

జలుమూరు: మండలంలోని లింగాలవలస రెవెన్యూ పరిధిలోని చల్లవానిపేట వద్ద గల చంద్రశేఖర్ చెరువులో ఆక్రమణలను గుర్తించి సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ జెన్ని రామారావు తెలిపారు. మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. రికార్డుల ప్రకారం చెరువు విస్తీర్ణం 4.10 ఎకరాలుగా ఉండాలన్నారు. చెరువు హద్దులు సరిచేసి ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగిపోవాలని ఆదేశించారు. సర్పంచ్ పంచి రెడ్డి రామచంద్రరావు, రెవెన్యూ పరిశీలకులు కిరణ్, సచివాలయ సర్వేయర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరుచేయాలి



రామారావు

సరుబుజ్జిలి: స్పౌజ్ పింఛన్ల మంజూరులో కూటమి ప్రభుత్వ లేనిపోని నిబంధనలు విధించడం ఎంతవరకు సమంజసమని ఆమదాలవలస వ్యవసాయ మర్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బద్రి రామారావు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31వ తేదీ మధ్యలో భర్త చనిపోతే భార్యకు పింఛన్ అందించేందుకు ఈ ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందన్నారు. భర్తకు పింఛన్ ఉంటేనే భార్యకు మంజూరు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. సరుబుజ్జిలి మండలం ఇస్కలపాలెం పంచాయతీలో అనేక మంది పింఛన్లు పొందేందుకు అర్హులు ఉన్నప్పటికీ.. ఇద్దరు మాత్రమే అర్హత సాధించినట్లు చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులందరికీ పింఛన్లు అందించాలని కోరారు.

టీడీపీ కార్యకర్తలకే పథకాలా?



వెంకటరామకృష్ణ

హిరమండలం: టీడీపీ కార్యకర్తలకే సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం.. బీసీలకు అన్యాయం చేసిందన్నారు. మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 422 మంది యువకులు దరఖాస్తు చేసుకుంటే.. కేవలం 36 యూనిట్లు మంజూరు చేయడం దురదృష్టకరమన్నారు. బీసీ మహిళలు కుట్టు మిషన్ల కోసం సుమారు 195 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 91 మంది టీడీపీ కార్యకర్తలనే ఎంపిక చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, ప్రాంత, రాజకీయ పార్టీలు అని చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అనేక సంక్షేమ పథకాలు అందించిన విషయాన్ని గుర్తుచేశారు.

కుంకుమార్చనలు..



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నరసన్నపేట: మండలం దాసరివానిపేట, యారబాడు గ్రామాల్లో నీలమ్మ తల్లి ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మంగళవారం హోమం, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాసరివానిపేటలో అమ్మవారికి కుంకుమ పూజలు చేపట్టారు. బుధవారం నీలమ్మ తల్లి ప్రతిష్ఠ నిర్వహిస్తారు. ఈ మేరకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు.

ఉపాధి వేతనదారులకు..

బీమాతో ధీమా..



కొమర్తి పెట్రోల్ బంకు వద్ద చెరువులో పనులు చేస్తున్న వేతనదారులు

- పీఎం సురక్ష యోజన పథకానికి ఏడాదికి రూ.20 ప్రీమియం
- జీవనజ్యోతి యోజన పథకానికి ఏడాదికి రూ.436 ప్రీమియం
- వేతనదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లకు అప్పగింత
- మండలాల్లో వేలాది మందికి బీమా ప్రయోజనం



నారాయణవలసలో వేతనదారుల నుంచి దరఖాస్తులు సేకరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

నరసన్నపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం తక్కువ ప్రీమియంతో బీమా సదుపాయం కల్పిస్తోంది. ప్రమాదాల్లో వేతనదారులు మరణించినా, వైకల్యం కలిగినా పరిహారం అందనుంది. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలను అమలు చేస్తోంది. వీటిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, ప్రతీ వేతనదారుడు ఈ పథకాల్లో చేరేలా క్షేత్రస్థాయిలో సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ఈ బాధ్యతను గ్రామాల్లో ఉన్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు అప్పగించారు. ఇప్పటికే గ్రామాల్లో దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్లు వేతనదారులకు సమాచారమిచ్చారు. తాజాగా పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖల కమిషనర్లు కింది స్థాయి సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. వేతనదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని బ్యాంకుల్లో నమోదు చేయించేందుకు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లుకు బాధ్యతలు అప్పగించారు. వీరు వేతనదారులతో దరఖాస్తులపై సంతకాలు సేకరిస్తున్నారు. వేతనదారుల బ్యాంకు ఖాతాల నుంచి ప్రీమియం మొత్తాన్ని మినహాయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ ప్రక్రియ ఊపందుకోగా నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 1,06,667 మంది ప్రయోజనం పొందనున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో దరఖాస్తుల సేకరణ లక్ష్యం వివరాలు..				
మండలం	నరసన్నపేట	పోలాకి	జలుమూరు	సారవకోట
లక్ష్యం	24,437	33,288	26,491	22,451

రెండు రకాలుగా బీమా సదుపాయం..

- ఉపాధి వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం పీఎం సురక్ష, పీఎం జీవనజ్యోతి యోజన పథకాల కింద రెండు రకాల బీమా సదుపాయం కల్పిస్తోంది. పీఎం సురక్ష బీమా యోజన పథకంలో 18 నుంచి 70 ఏళ్ల మధ్య ఉన్న వేతనదారులు ప్రతీ ఏటా రూ.20 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకంలో ప్రీమియం చేయించుకున్న వారు ప్రమాదవశాత్తు మరణించినా.. శాశ్వత వైకల్యం కలిగినా.. రూ.2 లక్షలు పరిహారం అందుతుంది. పాక్షికంగా వైకల్యం సంభవిస్తే లక్ష రూపాయలు సహాయం అందుతుంది.
- పీఎం జీవనజ్యోతి యోజనలో బీమా పొందేందుకు 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు అర్హులు. వీరు ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లించాలి. ఈ బీమా పథకంలో ఉన్నవారు ప్రమాదశాత్తు మరణించినా, సహజ మరణం పొందినా రూ.2 లక్షల పరిహారం అందుతుంది.

మే 2 లోగా దరఖాస్తులు అందించాలి



జాబుకార్డులు ఉన్న వేతనదారులందరూ ఈ రెండు బీమా పథకాల్లో ఏదో ఒక పథకంలో బీమా చేయించుకోవాలి. వేతనదారులతో దరఖాస్తులు సేకరించి ఆయా బ్యాంకులకు మే 2వ తేదీలో అందజేయాలి. ప్రతీ వేతనదారుడు విధిగా దరఖాస్తులపై సంతకాలు చేసి.. కావాల్సిన జిరాక్స్ పత్రాలు ఆయా మేట్లుకు, ఫీల్డ్ అసిస్టెంట్లు అప్పగించాలి. జాప్యం చేస్తే బీమా రక్షణ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు బాధ్యతగా వేతనదారుల నుంచి దరఖాస్తులు సేకరించి ఆయా బ్యాంకులకు అప్పగించాలి.

– యుగంధర్, ఏపీఓ, నరసన్నపేట

గిరిజన గ్రామాల్లో దాహం కేకలు



రెడ్డి శాంతికి తాగునీటి సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

- తాగునీరు ఇవ్వలేని కూటమి ప్రభుత్వం
- భరణికోటలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: మండలంలోని గిరిజనులు తాగునీటికి కటకటలాడుతున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలు అన్నారు. భరణికోట గ్రామంలో మంగళవారం పర్యటించారు. గ్రామ మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామంలో తాగునీరు లేక గిరిజన ప్రజలు పడుతున్న అవస్థలను చూసి చలించిపోయారు. పలు గిరిజన గ్రామాల్లోని తాగునీటి సమస్యను కూటమి నాయకులు, అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో కేవలం తాగునీరు అందించడానికే రూ.62 కోట్లతో.. 360కి పైగా పనులను చేపట్టినట్లు తెలిపారు. మెళియాపుట్టి మండలంలో తాగునీటికి రూ.16 కోట్లు ఖర్చు చేశామన్నారు. కూటమి ప్రభుత్వంలో కనీసం తాగునీరు ఇవ్వలేకపోవడం బాధాకరమన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోగానే వ్యతిరేకత వచ్చిందన్నారు. పార్టీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, మండల నాయకులు ఉర్లాన బాలరాజు, పల్లియోగి, రంగారావు, చీపురుపల్లి సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు, సుభాస్, అలికాన మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం ఓట్లన్నీ ఒకేచోట ఉండాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా

పాతపట్నం: ఒక కుటుంబానికి చెందిన ఓట్లన్నీ ఒకేచోట ఉండాలని బీఎల్‌ఓలకు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌ఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రాజా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు సవరణలపై అభ్యంతరం ఉంటే తెలియజేయాలన్నారు. నియోజకవర్గంలోని బీఎల్‌ఓలకు ఓటర్ల జాబితా సవరణపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు కూడా బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం చేసి ఓటర్ల జాబితా సవరణలో పాల్గొనాలన్నారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, గోకవలస రాము, పనుకు మోహన్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా పాలపోలమ్మ పండగ



అమ్మవారికి ముర్రాటలు తీసుకువెళ్తున్న భక్తులు

ఆమదాలవలస: పట్టణంలోని గ్రామ దేవత పాలపోలమ్మ పండగను 16వ వార్డులోని డాబాలవారి వీధి, కుసుమంచివారివీధి, వరదావారి క్వార్టర్స్, ప్రధాన రహదారి, మార్కెట్ వీధి, తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలంతా మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు ముర్రాటలు తీసుకువచ్చి అమ్మవారికి చల్లదనం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పులివేషాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న వేషధారణలు

శిథిలావస్థలో..



సరుబుజ్జిలి మండలం చెవ్వాకుల పేట బ్రిడ్జీ శిథిలావస్థకు చేరుకుంది. ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు. పాడైన బ్రిడ్జీ ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడంలేదు. అధికారులు స్పందించి సత్వర చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – సరుబుజ్జిలి

అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయండి

పాతపట్నం: నియోజకవర్గంలో అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసి, యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని జెడ్పీ సీఈఓ ఎల్.వి.ఎస్.శ్రీధర్ రాజా అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళికలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినున్న స్వర్ణ ఆంధ్రా కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అమలు చేయాలన్నారు. సూపరింటెండెంట్ తిరుపతి పట్నాయక్, ప్రణాళిక అమలు సిబ్బంది రమణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట–దబ్బపాడు గ్రామాల మధ్య ఉన్న కడపలవానిగెడ్డపై రూ.67 లక్షల ఖర్చుతో వంతెన నిర్మాణ పనులకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే వంతెన నిర్మాణం పూర్తిచేయాలన్నారు. ఆర్అండ్‌బీ డీఈ ఎం.ఎల్.వి.సాగర్, ఏఈ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి దారుణం



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వర్తక సంఘం ప్రతినిధులు



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

నరసన్నపేట: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడులకు నిరసనగా నరసన్నపేటలో వర్తక వాణిజ్య సంఘం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారికి సంతాపం తెలిపారు.

తప్పిన ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బూర్జ: మండలంలోని పెద్దపేట జంక్షన్ ప్రధాన రహదారి వద్ద పాలకొండ నుంచి ఆమదాలవలస వైపు వెళ్తున్న ఖాళీ లారీ నుంచి మంగళవారం రాత్రి మంటలు వచ్చాయి. స్థానికులు గుర్తించి లారీని ఆపి మంటలు వస్తున్నాయని తెలియజేయడంతో డ్రైవర్ పరిశీలించారు. రెండు టైర్లు రాపిడి వలన ఈ ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నారు. స్థానికుల సహాయంతో పాలకొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి మంటలను నిలుపుదల చేశారు. ఎవరీ ఎటువంటి ప్రమాదం జరగలేదని అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు తెలియజేశారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం

హిరమండలం: వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని స్థానిక గ్రంథాలయాధికారి కె.ఎర్రమ్మ అన్నారు. మంగళవారం విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాసరావు ఇంగ్లిషులో మాట్లాడటం, రాయడంపై వగాహన కల్పించారు.

పోలాకిలో..

పోలాకి: వేసవి సెలవుల్లో విద్యార్థులకు స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ కె.మానస మంగళవారం తెలిపారు. గ్రంథాలయంలో కథలు, సామెతలు, మహానుభావుల జీవిత విశేషాలకు చెందిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చింతాడ రవికుమార్, ధర్మాన కృష్ణదాస్, రమేష్‌కుమార్

ఆమదాలవలస: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విజయవాడలోఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, ఆమదాలవలస మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఉన్నారు. ఆమదాలవలస నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలపై చర్చించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని జగనన్న హామీ ఇచ్చారని రవికుమార్ తెలిపారు.

నిలిచిన భూ రిజిస్ట్రేషన్లు



బోసిపోయిన ఆమదాలవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఆమదాలవలస రూరల్: జిల్లా అంతటా భూరిజిస్ట్రేషన్లకు మంగళవారం సర్వర్ సమస్యలు ఎదురయ్యాయి. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సర్వర్ పని చేయకపోవడంతో క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. కొత్తగా స్లాట్ బుకింగ్ విధానం వచ్చినందు వల్ల స్లాట్ బుకింగ్ చేసిన సమయానికి క్రయ, విక్రయ దారులు కార్యాలయంలో అందుబాటులో లేకపోతే అందుకు తగిన అపరాధ రుసుం కూడా చెల్లించి మళ్లీ స్లాట్ బుక్ చేయాల్సి ఉంటుంది. మంగళవారం సుమారు మూడు నుంచి నాలుగు గంటలపాటు సర్వర్ సమస్య ఉండటంతో రిజిస్ట్రేషన్లు సకాలంలో పూర్తికాక క్రయ, విక్రయ దారులు నానా ఇబ్బందులు పడ్డారు.

షట్టర్లు ఏర్పాటు చేయరూ..



నరసన్నపేట మండలం ఉర్లాం–జల్లువానిపేటల మధ్య మూర్తి రాజు కాలువపై పూర్తి స్థాయిలో షట్టర్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. వందల ఎకరాలకు సాగు నీరు అందించే ఈ కాలువపై షట్టర్లు లేకపోవడంతో నీటి సరఫరా సక్రమంగా జరగడంలేదు. అధిక వర్షమైతే పొలాలు ముంపునకు గురవుతున్నాయని, నీరు తక్కువ అయితే పైర్లు ఎండి పోతున్నాయని రైతులు అంటున్నారు. వంశధార అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. – నరసన్నపేట

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు



సారవకోట మండలంలోని అక్కివలస గ్రామానికి సమీపంలో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. వంశధార కాలువపై గతంలో ఉన్న వంతెనకు పక్కన మరో వంతెన నిర్మించారు. కొత్త వంతెన, పాత వంతెనకు మధ్యలో రెండు విద్యుత్ స్తంభాలుండటంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ వంతెనలకు సమీపంలో గ్రానైట్ క్వారీలుండటంతో నిత్యం భారీ వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. – సారవకోట